

ముల్కలపల్లిలోని ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి మహిళతో మాట్లాడుతున్న కేంద్రబృందం



దోర్నకల్ మండలం ముల్కలపల్లిలో పాత బ్రిడ్జిపై కూలిన హైలెవల్ వంతెన పిల్లర్ (ఫైల్)

మాను'కోట్ల' నష్టం



- జిల్లాలో వరదలకు రోడ్లు ధ్వంసం
- పాడైపోయిన పంటలు, కూలిన ఇళ్లు
- కేంద్ర బృందానికి అధికారుల నివేదికలు అందజేత
- వ్యవసాయశాఖకు 40,697 ఎకరాల్లో వివిధ పంటలకు దెబ్బ
- 189 కిలోమీటర్ల మేర కొట్టుకుపోయిన రోడ్లు
- నీటిపారుదల శాఖలో చెరువుల మరమ్మతుల కోసం రూ.23.36 కోట్లు అవసరమని నివేదిక

మహబూబాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లాలో కుండపోతతో కురిసిన అతి భారీవర్షాలకు ఊహించనంత నష్టం వాటిల్లింది. కోట్లాది రూపాయల విలువైన పంటనష్టంతో పాటు ఉద్యానవన పంటలు, అనేక అర్అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖ రోడ్లు, చెరువులు, కల్వర్టులతో పాటు అనేక ఇండ్లు నేలమట్టం అయ్యాయి. నలుగురు వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందారు. పశుసంపద కూడా నష్టం వాటిల్లింది. దీంతో కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రి సీతక్కతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి అధికారుల బృందంతో వరదముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వెళ్లారు. బాధితులను ఓదార్చి,అండగా ఉంటామని భరోసా కల్పించారు. వరద నష్టంపై సర్వే చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దాంతో పాటు వరద నష్టాలను అంచనాలు వేసేందుకు కేంద్రబృందం కూడా బుధవారం రాత్రి మరిపెడ, డోర్నకల్ మండలాల్లో పర్యటించారు. మధ్యాహ్నం వరద ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందని భావించిన కేంద్ర బృందం మాత్రం చీకటిపడిన తర్వాతనే మరిపెడ విశ్రాంతి భవనానికి 6.31 గంటలకు చేరుకున్నారు.

కేంద్ర బృందా కల్నల్ కెపి.సింగ్, మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప కాగి, ఎస్‌కె కుష్వాహ, సురేంద్రమోహన్, టి.నిలయకన్నన్, డాక్టర్ శశివర్ధన్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్ సుమారు మూడు గంటల పాటు కేంద్ర బృందం మరిపెడ మండలంలోని పురుషోత్తమయగూడెం, ఉల్లెపల్లి, సీతారాంతండా, డోర్నకల్ మండలంలోని ముల్కలపల్లిలో రాత్రి 9.25 గంటల వరకు పర్యటించారు. బాధితులు తమకు జరిగిన నష్టాలను కేంద్ర బృందం ముందు ఏకరువు పెట్టారు. కేవలం మూడు గంటలపాటు చీకట్లోనే కేంద్ర బృందం టార్చిలైట్ల వెలుగులోనే బాధితుల కష్టాలను తెలుసుకున్నారు. ఈ జిల్లాలోని వివిధశాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన నష్టాలను కేంద్ర బృందానికి వివరించి, నివేదిక అందించారు. ఆదుకోవాలని జిల్లా యంత్రాంగం కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేసింది.



ముల్కలపల్లిలో వరదకు పంట కొట్టుకుపోయి రాళ్లు తేలిన వ్యవసాయ భూమి (ఫైల్)

40,697 ఎకరాల్లో పంటలు..

మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 28,361 మంది రైతులకు 40,697 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయశాఖ అంచనాలు వేసింది. వరి, పత్తి, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. మహబూబాబాద్‌లో 6,611 ఎకరాల్లో, మరిపెడలో 5,631, కొత్తగూడలో 4,649,డోర్నకల్‌లో 4,230, కురవిలో 2,679 ఎకరాల్లో నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల కేంద్ర బృందానికి నివేదిక సమర్పించారు. పంటల నష్టంపై ప్రత్యక్షంగా క్షేత్రప్రదర్శన చేసి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనాలు వేస్తున్నారు. ఇప్పటి వరకు 9,900 ఎకరాల్లో వివిధ పంటల నష్టాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. మిగతా పంటల సర్వే జరుగుతోంది. కాగా, కేంద్రబృందం ప్రత్యేకంగా డోర్నకల్ మండల వ్యవసాయాధికారి మురళీమోహన్‌ను పిలిచి డోర్నకల్ మండలంలో జరిగిన నష్టం వివరాలు తెలుసుకున్నారు.

వరదలతో నష్టం జరిగిన వివరాలను ఫొటోగాలరీ ద్వారా కేంద్రబృందం సభ్యులకు వివరిస్తున్న కలెక్టర్



52 ఎకరాల్లో ఉద్యానపంటలకు..

జిల్లాలోని ఏడుగురు రైతులకు చెందిన 30 ఎకరాల్లో బొప్పాయి తోటలు, రెండెకరాల్లో మామిడి తోటలు, 20 ఎకరాల్లో పామాయిల్ తోటలకు నష్టం వాటిల్లిందని ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న కేంద్ర బృందానికి నివేదిక సమర్పించారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యం లో మహబూబాబాద్ జిల్లాలోని 189 కిలోమీటర్ల పొడవైన 51 రోడ్లు పూర్తిగా తెగిపోగా, మరికొన్ని ధ్వంసమయ్యాయి. 36 రోడ్లు అధికంగా ధ్వంసం కాగా, 15 అదర్ డిస్టిక్ రోడ్లు పాడైపోయాయి. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.636.10లక్షలు అవసరం కాగా, శాశ్వత మరమ్మతుల కోసం రూ.17,868.00లక్షలు అవసరం ఉంటుంది. ఆకేరు వాగు ఉధృతికి డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద జాతీయరహదారి 365/ఏ రోడ్డు 200మీటర్ల మేర హైలెవల్ బ్రిడ్జి కొట్టుకుపోగా, 700మీటర్ల అప్రోచ్‌రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో మహబూబాబాద్-ఖమ్మం రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు అత్యవసర రవాణా సౌకర్యం కల్పించేందుకు గాను కేవలం నాలుగు రోజుల్లో పనులు చేపట్టి పూర్తి చేశారు. మరికొంత తాత్కాలిక మరమ్మతులు చేయాల్సి ఉంది. ఈ మరమ్మతులకు సుమారు రూ.4 కోట్లు అంచనా వేయగా, శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 నుంచి 20 కోట్లు అవసరం ఉంటుందని అధికారులు అంచనావేస్తున్నారు.

గూడూరు-కేసముద్రం మధ్య 14కిలోమీటర్లు, నర్సింహులపేట-ఉగ్గంపల్లి మధ్య, కొత్తగూడ మండలం సాధిరెడ్డిపల్లి వద్ద కల్వర్టు పునర్ నిర్మాణానికి గాను తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.33 లక్షలు అవసరం ఉండగా, శాశ్వత మరమ్మతుల కోసం రూ.98 లక్షలు అవసరం ఉంది. అంచనాలను అధికారులు ఫైనల్ చేయలేదు. దీంతోపాటు పురుషోత్తమయగూడెం వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. అలాగే మరికొన్ని రోడ్లు కొట్టుకుపోగా, కొన్ని పాక్షికంగా ధ్వంసమయ్యాయని ఆర్అండ్‌బీ అధికారులు కేంద్ర బృందానికి నివేదిక సమర్పించారు.

పంచాయతీరాజ్ శాఖకు తెగిన 95 రోడ్లు..

జిల్లాలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలోని 95 రహదారులు పూర్తిగా తెగిపోగా, 214 రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.347.10 లక్షలు అవసరం కాగా, శాశ్వత మరమ్మతుల కోసం రూ.5,908.50 లక్షలు అవసరం ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ అధికారులు అంచనా వేసి కేంద్ర బృందానికి సమర్పించారు.

133 చెరువులకు నష్టం..

జిల్లాలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 73 చెరువులు పూర్తిగా తెగిపోగా, 57 చెరువులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దాంతో పాటు డీబీఎం-60 మెయిన్ కెనాల్‌లో ఒక కట్ట తెగిపోగా, రెండు ధ్వంసమయ్యాయి. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.4.38 కోట్లు అవసరం ఉంటుందని, శాశ్వత మరమ్మతుల కోసం రూ.23.36 కోట్లు అవసరం ఉంటుందని కేంద్ర బృందానికి నీటిపారుదలశాఖ అధికారులు వివరించారు. ఈ రోజు వరకు 118 చెరువులకు కొలతలు వేసి అంచనాలు తయారు చేస్తున్నారు.

చేపలు కొట్టుకుపోవడంతో మత్స్యకారులకు భారీ నష్టం వాటిల్లింది. కేంద్ర బృందాన్ని కలిసిన వారిలో నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జిల్లా నీటిపారుదలశాఖ అధికారి పసంద్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సమ్మిరెడ్డి, సుదర్శన్‌రావు, నారాయణతో పాటు డీఈలు, ఏఈలు ఉన్నారు.

11,663 పశుసంపదకు నష్టం, విద్యుత్ శాఖకు దెబ్బ..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గొర్రెలు, మేకలు, గేదేలు, ఆవులు, కోళ్లకు కూడా తీరని నష్టం జరిగింది. మరిపెడ మండలంలోని ఉల్లెపల్లి, సీతారంతండ, బాల్నిధర్మారం, డోర్నకల్‌మండలంలోని ముల్కలపల్లి, నెల్లికుదురు మండలంలోని రావిరాల గ్రామాల్లో ఎక్కువగా పశుసంపదకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 11,663 పశుసంపదకు నష్టం కాగా, రూ.47.61 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు కేంద్ర బృందానికి నివేదించారు. మహబూబాబాద్ డివిజన్‌లో విద్యుత్‌శాఖకు సంబంధించి 700 విద్యుత్ స్తంభాలు, 106 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. నష్టం అంచనా సుమారు రూ.40 లక్షల వరకు ఉంటుందని అధికారులు నివేదిక సమర్పించారు.



మాట్లాడుతున్న రవీంద్రశర్మ

జాతీయ లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 12 : మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ ఆదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కోర్టులోని వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిన్నింటిని సత్వరమే పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. కక్షిదారులు రాజీమార్గం ద్వార తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సీవిల్ జడ్జి సురేష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద అన్నదానాలు



మహబూబాబాద్‌లో వినాయక విగ్రహం వద్ద అన్నదానం ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 : జిల్లా కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. 23వవార్డు పరిధిలోని మెయిన్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నారికేళం సమర్పించి పూజలు చేశారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ మార్నేని శ్రీదేవి రఘు, బానోత్ రవికుమార్, ఎడ్ల వేణుమాధవ్, తేళ్ల శ్రీను, మార్నేని కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలనీలో అన్నదానం..

మహబూబాబాద్ మునిసిపల్ 26వవార్డు పరిధిలోని కాకతీయ కాలనీలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ దౌలాగర్ స్వాతిశంకర్, పద్మం ప్రవీణ్, జెల్లి శ్రవణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ముల్కనూరు వద్ద రిజర్వాయర్ నిర్మించాలి

- సైంటిస్ట్ అశ్విని పేరిట స్మృతివనం ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 : జిల్లాలోని గార్ల మండలం ముల్కనూరు సమీపంలోని పాకాల వాగుపై రిజర్వాయర్‌ను నిర్మిస్తే.. ఈ ప్రాంత వ్యవసాయ స్థిరీకరణకు దోహద పడడంతో పాటు ఖమ్మంకు నష్టనివారణ జరుగుతుందని శాసనమండలి సభ్యుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన సమయంలో ముల్కనూరు వద్ద రిజర్వాయర్ నిర్మించేందుకు ప్రయత్నాలు జరగ్గా, అక్కడ రిజర్వాయర్ నిర్మిస్తే కృష్ణానదికి జలాలు తగ్గుతాయనే ఆలోచనతో అప్పట్లో ఆంధ్రపాలకులు నిర్మించనివ్వలేదని ఆరోపించారు. ముల్కనూరు వద్ద రిజర్వాయర్‌ను నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరువాగులో తండ్రి కూతుళ్ల మోతీలాల్, సైంటిస్ట్ అశ్విని నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందడం బాధాకరమన్నారు. అశ్విని పేరిట స్మృతివనంను నిర్మించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరామ్

వర్షాలతో ఖమ్మం, మానుకోట, సూర్యాపేటల్లో తీవ్ర నష్టం..

తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో ఖమ్మం, మానుకోట, సూర్యాపేట జిల్లాల్లో అత్యధికంగా నష్టం వాటిల్లిందని ఎమ్మెల్సీ కోదండరామ్ చెప్పారు. తద్వారా ఆయా జిల్లాలో పంట, ఆస్తినష్టం వాటిల్లిందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా కుండపోత వర్షం కురిసి విధ్వంసం సృష్టించిందని, ఇది విచిత్రమైన పరిస్థితి అని పేర్కొన్నారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం ప్రకారం జిల్లాస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు కమిటీలు వేసి జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. నీరు వృథాకాకుండా, ప్రజలకు ఎలాంటి నష్టం కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారి సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వర్షాలకు నష్టపోయిన వారికి రాష్ట్రప్రభుత్వం తక్షణ సహాయం అందిస్తోందని చెప్పారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతి జాతీయ రాజకీయాలకు తీరనిలోటని ఆయన అన్నారు. సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అంబటి శ్రీనివాస్, టీజేఎస్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పిల్లి సుధాకర్, బైరి రమేష్, షైన నాగయ్య, షైన శ్రీనివాస్, ధర్మార్జున్, మేకపోతుల నర్సయ్య, ఆంజనేయులు, గాడిపెల్లి అనిల్, రవికుమార్, ఇరుగు మనోజ్, హన్మంత రెడ్డి, లాలయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితుల సహాయార్థం స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు ముందుకు రావాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకాధికారులు, సిబ్బంది అంకిత భావంతో ప్రజలకు సేవచేయాలని చెప్పారు. జిల్లా యంత్రాంగం, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య ఇతర శాఖల అధికారులంతా కలిసి ఇప్పటికే సహాయ చర్యలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న గృహాలు, రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలు, వాగుల ప్రమాద బాధితుల సహాయార్థం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు 77 ఫోన్ కాల్స్ వచ్చాయని, వాటికి సంబంధించి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వరదల కారణంగా గ్రామాల్లో సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పట్టాలు, తదితర సర్టిఫికెట్లు కోల్పోయిన వారి వివరాలు సేకరించి వారికి కొత్తవి జారీ చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

జాతీయ విపత్తుగా గుర్తించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు12 : ఇటీవల కురిసిన భారీ వర్షాలను కేంద్రం జాతీయ విపత్తుగా గుర్తించి, తెలంగాణ రాష్ట్రానికి రూ.10 వేలకోట్లు వరదసాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్ చేశారు సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచిఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఏనిమిది మంది ఎమ్మెల్యేలున్న ప్పటికి రాష్ట్రానికి నిధులు తీసుకువచ్చిన దాఖలాలు ఏమిలేవన్నారు. తెలంగాణపై బీజేపీ సవతి తల్లి ప్రేమ చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బి.అజయ్‌సారథి రెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, వెంకన్న, భిక్షపతి, సందీప్, శేఖర్, రాజన్న,శ్రావణ్, మేక వీరన్న, రవీందర్, చిరంజీవి, అశోక్, రషీద్ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మానుకోటతో ఏచూరికి అనుబంధం



మహబూబాబాద్‌లో 2018 డిసెంబర్ 3న జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (ఫైల్)

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 : 2018 డిసెంబర్ 3న జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నాటి బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్‌పీ) అభ్యర్థి మోహన్‌లాల్ తరుపున మానుకోట జిల్లా కేంద్రంలో జరిగిన ప్రచార సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావించాక రెండోసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఎం బలపరిచిన మోహన్‌లాల్ తలపడగా ఆయన గెలుపును కోరుతూ మానుకోటలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన బహిరంగ సభకు సీతారాం ఏచూరి హాజరై ప్రసంగించారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- సీసీ కెమెరాల పర్యవేక్షణలో శోభయాత్ర
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



వివరాలు 8లో..

బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



వివేకానందసెంటర్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 12 : బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జాతీయనాయకుడు, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ మాట్లాడారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లిన ప్రతిసారి భారతదేశ ఔన్నత్యాన్ని, సంస్కృతిని కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. విదేశీ గడ్డపై భారతదేశ ప్రతిష్టను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్న రాహుల్‌గాంధీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అభివృద్ధి చెందుతుంటే దాన్నిజీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నాయకులు ఇలాంటివి మాట్లాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, దార ఇందుభారతి, శ్రీనునాయక్, సిరికొండ సంపత్, మారగాని రాజుగౌడ్, మల్లం యశ్వంత్, నరేష్, రిషి, తరంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 12: గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొర్రెకుంట ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పేకాట శిబిరంపై దాడి చేశారు. 10 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి రూ.20 వేల నగదు, ఐదు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న 10మందిలో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం గీసుగొండ పోలీసులకు అప్పగించారు. ఆరుగురు పరారయ్యారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధ్రువీకరించారు.

నేడు నిట్‌లో ఫార్మా ఏఐ సదస్సు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12: కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ పేరుతో ఫార్మా ఏఐ సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిట్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సులో సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి.ప్రదీప్ ప్రారంభోపన్యాసం ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండలో ఫార్మారంగం భవిష్యత్తును చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 6డీ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ తాళ్లూరి, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎ.శ్రీకాంత్, డిప్యూటీ డైరెక్టర్ జి.రాంధన్, డాక్టర్ రెడ్డీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఓరుగంటి తదితరులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధితో పాటు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.సత్యశారద తదితరులు పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సు సాయంత్రం 4.30 గంటల వరకు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

దళితులను బహిష్కరించడం దుర్మార్గం

వడ్డెపల్లి, సెప్టెంబరు 12: మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం గోతోజీగూడెం గ్రామంలో డప్పు కొట్టలేదని దళితుడు పంచమి శంకరయ్యతోపాటు కుటుంబ సభ్యులను గ్రామ బహిష్కరణ చేయడం దుర్మార్గమని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్దన్ మాదిగ అన్నారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఎంహెచ్‌డీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకరయ్య చిన్న కుమారుడు జేఎన్‌టీయూలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కారణంగానే కక్ష కట్టి అగ్రవర్ణ ఆధిపత్య భావజాలం కలిగిన గ్రామ పెద్దలు గ్రామ బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీ, ఎమ్మెల్యే, ఎంపీలు శంకరయ్య కుటుంబానికి అండగా నిలవాలని ఎలుకటి జనార్దన్ మాదిగ కోరారు. ఎంహెచ్‌డీ రాష్ట్ర, జిల్లా నాయకులు రమేష్, రాజేష్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

వర్సిటీ భూముల్లో నివాసితులకు చుక్కెదురు

- హైకోర్టు మెట్లెక్కిన 9 మంది కాలనీవాసులు
- స్టేకు నిరాకరించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 12 : కాకతీయ యూనివర్సిటీ సర్వే నెంబరు 229లో నివాసముంటున్న 9మందితో పాటు మరికొందరు రాష్ట్ర హైకోర్టు మెట్లెక్కారు. కొన్నేళ్లుగా సర్వే నెంబర్ 229లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న నేపథ్యంలో వర్సిటీ అధ్యాపకుల సంఘం, వర్సిటీ విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర విద్యాశాఖాధికారులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నేతృత్వంలో రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ప్రత్యేక సర్వే చేపట్టింది. వర్సిటీలోని అన్ని సర్వే నెంబర్లలో సర్వే చేపట్టి భూ కబ్జాలను తేల్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా రెండురోజులుగా వర్సిటీలోని బీసీ కాలనీలో అధికారులు సర్వే చేపట్టారు. సర్వేలో బీసీకాలనీకి చెందిన భవనాలు, అంతర్గత ప్రధాన రహదారి సైతం వర్సిటీ భూముల్లోనే ఉందని రూఢీ అయింది. దీంతో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కబ్జాల్లోకి వచ్చిన వారిపై చట్టరీత్యా చర్యలకు ఉపక్రమించారు.

హైకోర్టులో..

జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సర్వేలతో వర్సిటీ భూముల వివరాలన్నీ పక్కాగా లెక్కలు తేల్చేపనిలో ఉండగా, 229 సర్వే నెంబర్‌తో పాటు గుండ్లసింగారం, కుమార్‌పల్లి సర్వేనెంబర్ల పరిధిలోని తొమ్మిది మంది గతంలో రాష్ట్ర హైకోర్టు తలుపులు తట్టారు. గతంలో వేసిన పిటిషన్ సెప్టెంబరు 12న గురువారం విచారణకు వచ్చింది. వర్సిటీ భూకబ్జాదారులు తరుపున న్యాయవాది స్టే ఇవ్వాలని కోరడంతో హైకోర్టు స్టేకు నిరాకరించింది. మునిసిపల్ అధికారులు నోటీసు ఇచ్చారని, కూల్చివేతలకు పాల్పడే అవకాశం ఉందని కోర్టుకు తెలుపడంతో కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే మునిసిపల్ అధికారులు తదుపరి చర్యలు తీసుకునే ముందు భూకబ్జా, అక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిచ్చిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులు చట్టానికి అనుగుణంగా ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని హైకోర్టు అభిప్రాయాన్ని వెల్లడించింది. కాగా, కోర్టు మెట్లెక్కిన వర్సిటీ కాలనీలకు హైకోర్టు తాజాతీర్పులో ఊరట లభించకపోవడంతో వర్సిటీ భూముల చెర వీడనుంది. వర్సిటీ భూముల కబ్జాలకు పాల్పడిన వారిలో ఆందోళన మొదలైంది. కబ్జాలు తెలిన తక్షణమే కూల్చివేతలు చేపడుతామని ఇప్పటికే మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. కాగా, హైకోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందని హైకోర్టుకు వెళ్లిన బాధితులు చేబుతున్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

మడికొండ, సెప్టెంబరు 12: మరణానంతరం నేత్ర దానంతో ఇద్దరు అంధులకు కంటిచూపు చేకూరుతుందని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొన్ రెడ్డి మల్లారెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన బిల్ల ధర్మారెడ్డి (55) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి డాక్టర్ లక్ష్మణ్ ద్వారా నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 : నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయుటు శ్రీరాములు అన్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి బానోత్ గణేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ బేస్‌బాల్ పోటీల్లో గణేష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా గణేష్ రాణిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మందుల పద్మ, ఉపాధ్యాయులు రవి, రవికుమార్, ప్రేమ్‌కుమార్, ఉమారాణి, కృష్ణ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శ్రీలత పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ కోర్సుల డబ్బులపై విచారణ జరపాలి

- కేయూ పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు కిరణ్‌గౌడ్



మాట్లాడుతున్న పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 12: కేయూ ఎస్ఎఫ్‌సీ కోర్సులకు చెందిన రూ. 40 కోట్లు అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో వెంటనే విచారణ జరపాలని కేయూ పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కేయూ క్యాంపస్‌లోని క్యాంటీన్ ఎదుట ఏర్పాటు చేసిన పార్టుటైం అధ్యాపకుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోల్తి కిరణ్ గౌడ్ హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లోని వీసీ, రిజిస్ట్రార్‌లు రూ.40కోట్లు దారి మళ్లించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఐదేళ్లకోసారి ఎస్ఎఫ్‌సీ కోర్సులన్నీ రెగ్యులర్ కోర్సులుగా అప్‌గ్రేడ్ చేయాలనే నిబంధనలున్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. 15ఏళ్లు దాటినా ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయడం లేదన్నారు. అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు చేపట్టిన ఎస్ఎఫ్‌సీ కోర్సులన్నీ డబ్బులన్నీ తిరిగి ఆయా కోర్సులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేయూ పార్టుటైం అసోషియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, సలహాదారులు కృష్ణ సుమంత్, శ్యాంసుందర్‌చారి, రజనీకాంత్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు బీఎస్ఎస్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు నచ్చి చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలే దని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ చైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్యలోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

ఏడీఏ లక్ష్మీనారాయణకు సన్మానం


మహబూబాబాద్ రైతు వేదికలో ఏడీఏ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న డీలర్లు, అధికారులు

మహబూబాబాద్ అగ్రికల్చర్,సెప్టెంబరు 12 : ఇటీవల బదిలీపై వెళ్లిన మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.లక్ష్మీనారాయణను మహబూబాబాద్ ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వ్యవసాయశాఖ అధికారులు సన్మానించారు. మహబూబాబాద్ రైతు వేదికలో బుధవారం రాత్రి ఈ సన్మాన కార్యక్రమం వ్యవసాయాధికారులు ఎస్.తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రస్తుత మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జిల్లాలోని వ్యవసాయాధికారులు బి.వెంకన్న, కె.రామారావు, బానోత్ రాంజీ, ఉదయ్, అబ్దుల్ మాలిక్‌తో పాటు ఫర్టిలైజర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఓలం రమేష్, మండల శాఖ అధ్యక్షులు వేమిశెట్టి సోమయ్య, వక్కల శ్రీను, చిదురాల జ్ఞానేశ్వర్, బాబ్జీ, శ్రీను పాల్గొనగా మరో డీలర్ల సంఘం ఆధ్వర్యంలో పాండు రంగయ్య నేతృత్వంలో ఏడీఏను సన్మానించారు.

గీతన్నకు రక్షణ 'కాటమయ్య కిట్లు'

- జిల్లాలో 134 కిట్లతో రెండు విడతల్లో తొలి ప్రయోగం
- ఎక్సైజ్ సూపరిండెంటెంట్ కిరణ్‌నాయక్


నర్సింహులపేటలో కాటమయ్య కిట్ల ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్‌నాయక్

నర్సింహులపేట, సెప్టెంబరు 12 : కల్లు గీతకార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య కిట్లు ఎంతో ఉపయోగకరమని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌నాయక్ అన్నారు. బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో గురువారం నర్సింహులపేటలో గీత కార్మికులకు కాటమయ్య కిట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 156 సొసైటీలకుగాను 7,483 మంది, 16 టీఎఫ్‌టీలో 756 మందితో కలిపి 8239 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. కల్లుగీత కార్మికులు తరుచూ ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఒక్కో కాటమయ్య కిట్టుకు రూ.7 వేల ఖర్చుతో రూ.9.38 లక్షల వ్యయంతో మహబూబాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా 134 కాటమయ్య కిట్లు అందజేసినట్లు తెలిపారు. దీనిలోభాగంగా మహబూబాబాద్ నియోజకవర్గంలో కేసముద్రం మండలం కోమటిపల్లిలో 34 మందికి, డోర్నకల్‌నియోజకవర్గంలోని కురవి, డోర్నకల్, సీరోల్ మండలాలకు తాళ్ల సంకీసలో 40 మంది, మరిపెడ, దంతాలపల్లి, చిన్నగూడూరు, నర్సింహులపేట, పెద్దవంగర మండలాలకు నర్సింహులపేటలో 60 మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కాటమయ్య కిట్లతో కల్లుగీత కార్మికుల తరుచూ ప్రమాదాలకు తెర పడుతుందన్నారు. ఈ ప్రయోగం విజయవంతంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8వేల మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కాటమయ్య కిట్లను గీత కార్మికులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నర్సింహమూర్తి, తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ తిరుపతి, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు మోహన్, పటేల్ రామన్న, గాడిపెల్లి రవి, పురుషోత్తం, ముత్తయ్య, వెంకన్న, వీరన్న, యాకయ్య, వెంకన్న ఉన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమిలేదు

- పాకాల ఏటిపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తా
- ఎమ్మెల్సీ కోదండరామ్


బ్రిడ్జి నిర్మించే ప్రాంతంలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న కోదండరామ్

గార్ల, సెప్టెంబర్ 12 : రాష్ట్రంలో గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమిలేదని, తెలంగాణలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఎమ్మెల్సీ కోదండరామ్ ఆరోపించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన తండ్రి మోతీలాల్, కూతురు అశ్విని ఇటీవల వరద ప్రమాదంలో మృతి చెందగా, గురువారం ఆ కుటుంబానికి పరామర్శకు వెళ్తూ.. ఆయన కొద్దిసేపు ప్రజల కోరిక మేరకు పాకాల ఏటి వరద ఉధృతిని వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకాల ఏటిపై వంతెన నిర్మాణం కోసం శాసన మండలిలో ప్రస్తావించి, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా టీఎన్‌జీవో అధ్యక్షుడు కూరపాటి రంగారాజు, జి.మురళి పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించేందుకు కృషి..

- నెల్లికుదురు : మండలంలోని రావిరాల గ్రామాన్ని ఎమ్మెల్సీ కోదండరామ్ పర్యటించారు. వరద బాధితులను ఓదార్చాడు, కూలిపోయిన ఇండ్లను, తెగిపోయిన చెరువు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు నష్టపరిహారం అందిచండాని కృషి చేయనున్నట్లు తెలిపారు. చెరువు మరమతులు చేయడానికి కలెక్టర్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, అశోద బాస్కర్, కారం ప్రశాంత్ అంబటి శ్రీనివాస్, భైరి రమేష్ పాల్గొన్నారు.

సావిత్రమ్మకు ప్రముఖుల నివాళులు

- మహబూబాబాద్ టౌన్ : మానుకోట పట్టణంలో సీపీఎం మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య సతీమణి, ఐద్వా పట్టణాధ్యక్షురాలు సావిత్రమ్మకు ఎమ్మెల్సీలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో ఐద్వా నేత సావిత్రమ్మ మృతి చెందిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కోదండరామ్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యానారాయణ, భైరి రమేష్, అంబటి శ్రీనివాస్, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుదాకర్ సావిత్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరోపక్క ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, బీఆర్‌ఎస్ నేతలు బానోత్ రవికుమార్, పిచ్చిరెడ్డి, రాజు, మంగలంపల్లి కన్న, తేళ్ల శ్రీను, మార్నేని రఘ సావిత్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఇంటి నెంబర్లతో సంబంధం లేకుండా విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


విద్యుత్ ఎస్‌ఈ నరేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 : మునిసిపాలిటీలో విద్యుత్ అధికారులు నిబంధనల పేరిట కరెంట్ మీటర్ మంజూరుకు ఇబ్బందులు పెడుతున్నారని, ఇంటి నెంబర్లతో సంబంధం లేకుండా లబ్ధిదారుల నుంచి అఫిడవిట్లు కరెంట్ మీటర్లను మంజూరు చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్‌ఈ నరేష్‌ను గురువారం కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు విద్యుత్ మీటర్ల మంజూరు పథకాన్ని సమర్థవంతగా నిర్వహించాలన్నారు. నిబంధనల పేరిట ఇబ్బందులను పెట్టకుండా అర్హత కలిగిన లబ్ధిదారులందరికి విద్యుత్‌మీటర్లు అందించాలని సూచించారు. ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా నిబంధనలను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్లు ఎడ్ల వేణు, మార్నేని రఘు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- సీసీ కెమెరాల పర్యవేక్షణలో శోభయాత్ర
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 12 : గణేష్ నవరాత్రిఉత్సవాల్లో భాగంగా వినాయక విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో శోభయాత్ర ఉంటుందని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని ప్రశాంతతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నిమజ్జనం జరిగే చోట గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిమజ్జనం జరిగేటప్పుడు డీజేలు, సౌండ్ సిస్టం, బాణాసంచా కాల్చడం వంటివి చేయకూడదన్నారు. చట్టాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలని, ఎవరైనా అతిక్రమిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నిమజ్జనాన్ని శాంతియుతంగా, సామరస్యంగా జరుపుకోవాలని, అందుకు ప్రజలు పోలీస్‌వారికి సహకరించాలని కోరారు.

ఏచూరిది ప్రత్యేక ముద్ర : సీపీఎం

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 : ప్రజాఉద్యమాల్లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రత్యేక ముద్రను వేసుకున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్‌లో గురువారం సీపీఎం జెండాను అవనతం చేసి సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమమంలో సీపీఎం నాయకులు గునిగంటి రాజన్న, బానోత్ సీతారాంనాయక్, కుమ్మరికుంట్ల నాగన్న, ఎమ్డీ. రజాక్, లక్ష్మన్, మచ్చ వెంకన్న, నగేష్, కిషన్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల కురిసి వర్షాలకు నష్ట పోయిన 25 కార్మిక కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, నాగన్న, శ్రీనివాస్, పాపారావు,శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

'వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి'

తొర్రూరు, సెప్టెంబరు 12 : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యులు, గ్రామాల్లో పనిచేసే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్‌రావు అన్నారు. గురువారం తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశ డే సమావేశానికి హాజరై వైద్య సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బంది స్థానికంగా ఉండి వారికి వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో పనిచేసే వైద్య సిబ్బంది తొర్రూరు, వరంగల్ పట్టణాల నుంచి విధులకు హాజరవుతున్నారని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు జ్వలిత, ప్రియాంక, మానస, వనాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- కేసముద్రం : సీజనల్ వ్యాధులపట్ల వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు అప్రమత్తంగా ఉంటూ నివారణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో మురళీధర్ ఆదేశించారు. కేసముద్రం పీహెచ్‌సీ ఆవరణలో ఆశడే సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఈఎంవో కొప్పుప్రసాద్, డీపీఎంవో రవీందర్, హెచ్‌ఈ రాజు, పురుషోత్తం, స్థానిక వైద్యాధికారి నంబికిషోర్, శ్రవణ్ పాల్గొన్నారు. అనంతరం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన పోస్టర్‌ను ఆస్పత్రి ఆవరణలో ఆవిష్కరించారు.

మతి స్థిమితంలేని వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య

డోర్నకల్, సెప్టెంబరు 12 : మతిస్థిమితం సరిగ్గాలేని ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జోగ్యతండాలో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. తండాకు చెందిన చాందావత్ భద్రు (30) అనే వ్యక్తి మతిస్థిమితం లేదు. బుధవారం ఆయన తల్లి, తండ్రి వ్యవసాయ పనులకు వెళ్లగా వారితోపాటు భద్రు కూడా వెళ్లాడు. తల్లిదండ్రులు వ్యవసాయపనుల్లో నిమగ్నమైనసమయంలో సమీపంలోని చెట్టుకింద ఉన్న పురుగుమందును తాగాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు భద్రును చికిత్సనిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు భద్రుతండ్రి చాందావత్ సోమ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బేస్‌బాల్ పోటీలకు నేరడ విద్యార్థులు

కురవి,సెప్టెంబరు 12 : నేరడ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వి.బాలాజీ, సమ్మెట ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్మల్‌లో జరిగే జూనియర్ బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందినవంశీ, చరణ్, జస్వంత్, బాలాజీ, ధనుష్, చైతన్య, సంతోష్, చంద్రకళ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు సాయిలు, మాంజీ, సుధాకర్, గంగాధర్, కరుణ, మాధవాచారి, శంకర్, కిష్టు, మున్నీసాబేగం, ప్రకాష్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : టీపీటీఎఫ్

కురవి, సెప్టెంబరు 12 : సీపీఎస్‌ను బేషరతుగా రద్దు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవి, మోదుగుల గూడెం, నేరడ మోడల్, కేజీబీవీ పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదును గురువారం చేపట్టారు. ఈసందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ కేజీబీవీ టీచర్లను రెగ్యులర్ చేయాలని, అన్నిపాఠశాలల యాజమాన్యాలు టీచర్లకు 1వ తేదీన వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, బలాష్టి రమేష్, కురవి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండ్ల విజయ్‌కుమార్, ఓదెల శివకుమార్, వి.విజయ్ రాజ్, జి.కార్తీక్, డి.బాలరాజు పాల్గొన్నారు.

'ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి'

నెల్లికుదురు సెంటర్, సెప్టెంబరు 12 : మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బదిలీ అయినా ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కౌన్సిలింగ్‌లో బదిలీ అయిన టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులను వెంటనే బదిలీ అయిన ప్రదేశాలకు వెళ్లే విధంగా గిరిజన సంక్షేమశాఖ డీడీకి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రాష్ట్రంలో బస్‌సర్వీస్‌లను పెంచాలి

- బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసం సారయ్య

కొత్తగూడ, సెప్టెంబరు 12 : రాష్ట్రంలో బస్‌సర్వీస్‌లను పెంచాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసం సారయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడలో గురువారం నిర్వహించిన సమావేశంలో సారయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో ఉచిత బస్‌సర్వీస్‌ను మాత్రమే అమలు చేసి సగం బస్‌సర్వీస్‌లను రద్దు చేసిందన్నారు. దీంతో బస్‌సర్వీస్‌లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. కొత్తగూడ. గంగారం మండలాలకు బస్‌సర్వీస్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జాడీ సారయ్య వాసం మునీందర్, పొడిశెట్టి రవీందర్, కొట్టె శ్రీనివాస్, రూప్లానాయక్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


కొత్తగూడలో మాట్లాడుతున్న వాసం సారయ్య

అన్నదానం.. మహాదానం

తొర్రూరు, సెప్టెంబరు 12 : అన్నదానం మహాదానమని, అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు పట్టణంలోని 16వ వార్డు పరిధిలో బాలవినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మహాన్నదానాన్ని ప్రారంభించారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, కౌన్సిలర్ బిజ్జాల మాధవి అనిల్, దొంగరి శంకర్, పేర్ల యమున, జంపా, విక్రాంత్, సరిత, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద ఆస్పత్రి ప్రారంభం

తొర్రూరు, సెప్టెంబరు 12 : ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నూతన భవనాన్ని శుక్రవారంప్రారంభించనున్నట్లు అయుర్వేద వైద్యాధికారి కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ రూ.20 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ ఆయుర్వేద నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆయుష్ శాఖ ఉప సంచాలకుడు, ఆయుష్ ఉన్నతాధికారులు హాజరవుతారని, డివిజన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలన్నారు. ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగు నీటికోసం మహిళలు ఆందోళన


పెద్దవంగరలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

పెద్దవంగర, సెప్టెంబర్ 12 : తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని మహిళలు ఖాళీ బిందెలతో గురువారం ఆందోళన చేపట్టిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక మహిళల వివరాల ప్రకారం. మండల కేంద్రంలోని తాగునీటి బోరు పనిచేయక నెలరోజులైనా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు అవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పొలాల వద్దకు వెళ్ళి తాగు నీటిని తీసుకోవల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.బోరును మరమ్మతు చేయించి తాగు నీరు అందించాలని కోరారు.

ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు నిర్వహించాలి : సీఐ

తొర్రూరు, సెప్టెంబరు 12 : వినాయక నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తొర్రూరు సీఐ జగదీష్ అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సర్కిల్ పరిధిలోని ఐదు మండలాల వినాయక మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిమజ్జనం రోజు సాయంత్రం 4గంటల లోపే చెరువుల వద్దకు తరలించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. మద్యం సేవించి డీజేలు పెట్టుకుని వేడుకలు చేపడితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఉపేందర్, క్రాంతికిరణ్, రాజు, మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

మరిపెడ, సెప్టెంబరు 12 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని అనేక చెరువులు, కుంటలకు గండ్లు పడిపోవడంతో చేపలన్ని సముద్రం పాలయ్యాయని, దీంతో మత్స్యకార కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ముదిరాజ్ మహాజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల ధనంజయ డిమాండ్ చేశారు. గురువారం మరిపెడ, చిన్నగూడూరుమండలాల ముదిరాజ్ మహాజన సంఘం సమావేశం మరిపెడ విశ్రాంతి భవన్‌లో జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జైముదిరాజ్‌తో కూడిన వాహన స్టిక్కర్లను ఆవిష్కరించారు. బయ్య ఉపేందర్, ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ కార్యదర్శి గంగరబోయిన రమేశ్, నాగరాజు, మల్లేశ్, కరుణాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుంతలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

పెద్దవంగర, సెప్టెంబర్ 12 : ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి ప్రైవేట్ స్కూల్ బస్సు దూసుకెళ్లిన సంఘటన మండల కేంద్రంలోని తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై పోలీసుస్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. తొర్రూరు డివిజన్ కేంద్రం లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ బస్సు రోజువారీగా తొర్రూరు నుంచి పెద్దవంగర పరిసరా ప్రాంతాల్లో విద్యార్థులను దించడానికి వెళ్తున్న క్రమంలో తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై పోలీసుస్టేషన్ సమీపంలోప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవర్ వాహనం నడుపుతున్న క్రమంలోనే రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. స్కూల్ బస్సులో ఉన్న విద్యార్థులు సురక్షితంగాబయటపడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

స్కూల్ తనిఖీ చేసిన డీఈవో

కేసముద్రం, సెప్టెంబర్ 12 : పెనుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి వి.రాజేశ్వర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను డీఈవో పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధనప్రణాళికలు రూపొందించుకొని అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనివ్వాలని సూచించారు. ఆయనవెంట ఏసీజీఈ మందుల శ్రీరాములు, హెచ్‌ఎం యాదగిరి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇనుగుర్తి,సెప్టెంబరు 12 : మీట్యతండాలో గుగులోతు వీరన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ వీరన్న కుటుంబాన్ని గురువారం పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం జరిగిన వీరన్న అంతిమ యాత్రలో పాడె మోశారు. మాజీ ఎమ్మెల్యే వెంట విజయ్‌యాదవ్, నరేష్, బాలు, రవి, రమేష్, రాజేందర్, శ్రీను పాల్గొన్నారు.

సభలను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 : మేడ్చల్ జిల్లా కాప్రా ఏఎస్‌రావునగర్‌లో ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్రమహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాహితి శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య వక్తలుగా ప్రొఫెషర్ హరగోపాల్, ప్రముఖ జర్నలిస్టు శ్రీనివాస్ హాజరవుతారని చెప్పారు. జేవీవీ బాధ్యులు హాజరు కావాలని కోరారు.

ఆర్యవైశ్య భవన్‌లో అన్నదానం


ఆర్యవైశ్య భవన్‌లో అన్నదానం చేస్తున్న దృశ్యం

కేసముద్రం, సెప్టెంబర్ 12 : కేసముద్రం స్టేషన్ ఆర్యవైశ్య భవన్‌లో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కరివేదుల కృష్ణారెడ్డి-లక్ష్మి దంపతుల సహకారంతో గురువారం అన్నదానం చేశారు. ఈ అన్నదానంలో 1500 మందికి భోజనం వడ్డించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఉత్సవ కమిటీ నిర్వాహకులు సామ ప్రకాశ్, మాలె రవి, బొనగిరి రాజు, వోలం సందీప్, లెంకలపల్లి శ్రీనివాస్, గిరిధర్, బచ్చు లక్ష్మీనారాయణ, తడివిశెట్టి రవీందర్, తాటికొండ రాము పాల్గొన్నారు. ఉప్పరపల్లి, కిష్టాపురంలో గణేష్ మండపాల వద్ద ముస్లిం యువకుడు షేక్ ఫయాజ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కేసముద్రం విలేజిలో..

కేసముద్రం విలేజిలో మహిళలు నిర్వహిస్తున్న వినాయక మండపం వద్ద గురువారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో పులిహోరను పంపిణీ చేశారు. నాలుగేళ్లుగా మహిళలే వినాయకున్ని ఏర్పాటు చేస్తుండగా ఈ సారి గణేష్ విగ్రహాన్ని సమయ్యగౌడ్ అందజేశారు.

వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు వెంటనే చేపట్టాలి

- కలెక్టర్‌కు ఉషోదయ వాకర్స్ విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 : మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలోని వాకింగ్ ట్రాక్‌కు మరమ్మత్తులు చేపట్టాలని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య కోరారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు గురువారం వినతి పత్రాన్ని అందించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ వెంటనే మునిసిపల్ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే వాకింగ్ ట్రాక్‌కు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బోనగిరి రవీంద్రగుప్తా, గౌరవ సలహాదారులు సాదు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో విఫలం

- ఏఐపీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్య

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 12 : గత పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ముంపు బాధితులను ఆదుకోవడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చల రంగయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గోకనపల్లి వెంకటేశ్వర్‌రావు, పాయం చిన్నచంద్రన్న, కొత్తపల్లి రవి, అవుల వెంకటేశ్వర్లు, జగ్గన్న, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు, ఉమగాని సత్యం, పైండ్ల యాకయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.